తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ, మానవహారం



కాణిపాకం, ఆగస్టు 24 ప్రభాతవార్త:
చందమామపై పరిశోధనల కోసం ఇస్రో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, స్థానిక నాయకులు మువ్వన్నెల జాతీయ జెండాలను చేతబట్టి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు పాఠశాల నుండి కాణిపాకం పురవీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ జయహో ఇస్రో అంటూ నినాదాలు చేశారు. అనంతరం అగరంపల్లె కూడలిలో బారీ జాతీయజెండాతో మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఐరాల వైకాపా మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతి సాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, మాజీ సర్పంచ్ గోపీనాధన్, తవణంపల్లె మాజీ ఎంపీపీ రవిప్రసాద్‌లతో పాటు పలువురు నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగరంపల్లె కూడలిలో జరిగిన మానవహారం

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు

**- ద్వైవార్షిక పథకాల మంజూరు కార్యక్రమంలో సిఎం**
**- జిల్లాలో 4,455 మందికి రూ.4.85 కోట్లు లబ్ధి**



సిఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త:
అర్హత వున్న ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నామని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హత వుండి ఏ కారణంతోనైనా సంక్షేమ పథకాలు అందకుంటే వారికి మలిదశలో మంజూరు చేయాలని నిర్ణయించి ఏడాదికి రెండు సార్లు పథకాల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వివరించారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి ద్వైవార్షిక పథకాల లబ్దిని లబ్దిదారులకు అందించే కార్యక్రమంలో భాగంగా బటన్ నొక్కి వారి బ్యాంకు ఖాతాలకు నిధులు జమ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2022 డిసెంబర్ నుండి 2023 జులై వరకు అమలు చేసిన వివిధ రకాల సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ కారణంతోనైనా లబ్ది పొందని 2.62 లక్షల మంది లబ్దిదారులకు 216.34 కోట్ల రూపాయలను బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు వర్చువల్ విధానంలో కలెక్టరేట్ నుండి జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్, మేయర్ అముద, స్త్రీ శిశు సంక్షేమశాఖ జోనల్ ఛైర్మన్ శైలజారెడ్డి, జడ్పీ మహిళా స్థాయి సంఘ ఛైర్మన్ భారతి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సగిలి షన్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో వైఎస్ఆర్ ఆసరా పథకం కింద 114 మంది లబ్దిదారులకు రూ.27.10 లక్షలు, వైఎస్ఆర్ రైతు భరోసా పథకం కింద 301 మందికి రూ.12.29 లక్షలు, జగనన్న వసతి దీవెన కింద 1,025 మంది విద్యార్థుల తల్లుల 987 మంది బ్యాంకు ఖాతాలకు రూ.89.11 లక్షలు, జగనన్న విద్యా దీవెన కింద 1,422 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు రూ.1.71 కోట్లు, అమ్మఒడి పథకం కింద 331 మంది లబ్దిదారులకు 43.03 లక్షల రూపాయలు, చేదోడు పథకం కింద 945 లబ్దిదారులకు రూ.94.50 లక్షలు, ఈబీసీ నేస్తం కింద 315 లబ్దిదారులకు రూ.47.25 లక్షలు, నేతన్న నేస్తం కింద ఇద్దరు లబ్దిదారులకు రూ.48 వేల రూపాయలు లబ్దిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు జమ అయ్యాయని వివరించారు. ఈకాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ డిఎంకె తులసీ, లబ్దిదారులు పాల్గొన్నారు.

# ద్వై వార్షిక పథకాల మంజూరులో 6303 మందికి లబ్ధి

**తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణరెడ్డి**



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 24, ప్రభాతవార్త
అర్హత గల ప్రతి ఒక్కరూ నవరత్నాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరిశీలన చేసి ద్వై వార్షిక విధానంలో అర్హతగల వారికి లబ్ధి కలిగేలా నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలో 6303 మందికి రూ. 9.28 కోట్లు మంజూరు జరిగిందని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి అర్హతగల లబ్ధిదారులకు ద్వై వార్షిక నగదు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించగా, జిల్లా కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని వీక్షించే విధంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేలా ఒకటికి రెండు సార్లు క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించడం జరుగుతుందని అన్నారు. గత మాసంలో జగనన్న సురక్ష నిర్వహించామని ఏ కారణం చేతనైనా అర్హత కలిగి పథకాల అందని లబ్ధిదారులను కూడా గుర్తించామని, ప్రతి ఆరు మాసాలకు అర్హత గుర్తించి పథకాలు అందిస్తున్నామన్నారు. ఇప్పటికి ఎవరైనా అర్హత గలిగి పథకాలు అందకుండా ఉంటే మరో 30 రోజుల సమయం వుందని దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు రూ. 9.28 కోట్ల మెగా చెక్కును జిల్లా కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ వెల్ఫేర్ ఆఫీసర్ చెన్నయ్య, డిఎల్‌డిఓ సుశీలాదేవి, మెప్మా పిడి రాదమ్మ, డిఆర్‌డిఎ, మెప్మా అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సారాభాయ్ తెచ్చిన 'షార్'రా భాయ్




**విక్రమ్ సారాభాయ్ పేరుతోనే విక్రమ్ ల్యాండర్ - చంద్రయాన్-3తో విశ్వంలో మార్మోగుతున్న షార్ పేరు**
**చంద్రునికి గురిపెట్టిన నేల ఇదే - ప్రపంచ రికార్డుకు అడుగుపడింది ఇక్కడే**



షార్‌లోని రాకెట్ కేంద్రం ముఖద్వారం

శ్రీహరికోట (తడ), ఆగస్టు 24 ప్రభాతవార్త
చంద్రయాన్-3తో ప్రపంచం మొత్తం శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం వైపు చూస్తోంది. ప్రపంచ రికార్డు సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు ఎంత పేరు వచ్చిందో చంద్రయాన్-3ని రోదశిలోకి మోసుకెళ్లిన ఎల్‌విఎం3 ఎం4 రాకెట్‌కు అంత పేరువచ్చింది. ఈ రాకెట్‌ను ప్రయోగించింది ఒకప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లా, ప్రస్తుతం తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం. ఇక్కడి నుంచి ఇప్పటికి ఎన్నో రాకెట్లు ప్రయోగించినప్పటికీ చంద్రయాన్3తో దశాబ్దాల భారతీయుల కల నెరవేరినట్లయింది. ఇంతకీ ఈ నేల ప్రాధాన్యత ఏమిటంటే ఒకప్పుడు అంతరిక్ష ప్రయోగ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు స్థల అన్వేషణ చేస్తుంటే వారికి కనిపించిన నేల ఈ శ్రీహరికోట దీవి. అప్పటికే అంతరిక్ష శాస్త్రవేత్తగా అగ్రగణ్యునిగా ఉన్న విక్రమ్ సారాభాయ్ అనే ఒక మహానుభావుడు ఈ నేలను గుర్తించారు. ఇక్కడ రాకెట్ ప్రయోగాలకు ఎంతో అనుకూలంగా ఉందని ఆయన తలపోశారు. సమీపంలోని సూళ్లూరుపేటకు చెందిన కొందరు ఇప్పటికీ సారాభాయ్‌ను గుర్తు చేసుకుంటూ ఉంటారు. ఈ స్థల అన్వేషణ తర్వాత ఇంతకన్నా మంచి స్థలం తమకు లభించదేమో అని ఆయన ఎగిరి గంతేసినంత పనిచేశారట. సారాభాయ్ తెచ్చిన ఈ శ్రీహరికోట క్రమంగా షార్ పేరుతో అభివృద్ధి చెంది నేడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఎన్నో రకాల రాకెట్ల ప్రయోగాలు, వంద ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చడమే కాకుండా గ్రహాల పరిశోధనలకు పంపించిన రాకెట్లు సైతం ఇక్కడి నుంచే ప్రయోగిస్తున్నారు. సూళ్లూరుపేట అనే చిన్న పట్టణానికి తూర్పు దిశగా పులికాట్ సరస్సులో శ్రీహరికోట దీవికి అప్పట్లోనే ఒక రోడ్డు వేశారు. ఆ రోడ్డుకు విక్రమ్ సారాభాయ్ పేరు పెట్టారు. ఈ మార్గం ప్రస్తుతం శ్రీహరికోటలోని రాకెట్ ప్రయోగ వేదికల వరకు ఉంటుంది. రాకెట్ విజ్ఞానానికి పురుడు పోసుకున్న కేరళలోని అంతరిక్ష కేంద్రానికి విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ అనే పేరు పెట్టారు. ఇవి కాకుండా పలు రాకెట్లలో ఉపయోగించిన కొన్ని ఉపకరణాలకు కూడా విక్రమ్ పేరు పెట్టి ఉన్నారు. ప్రస్తుతం చంద్రయాన్ ప్రయోగంలో విక్రమ్ ల్యాండర్ పేరుతో జాబిల్లిపై జెండా పాతారు. వాస్తవానికి నాలుగేళ్ల క్రితం చంద్రయాన్-2లో ఉపయోగించిన ల్యాండర్ పేరు కూడా విక్రమ్ ల్యాండర్‌గానే ఇస్రో శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అది విఫలం చెందడంతో చంద్రయాన్-3లో ప్రవేశపెట్టిన విక్రమ్ ల్యాండర్ పేరు ఎక్కడా చాలారోజుల వరకు ప్రస్తావించలేదు. అఖరుకి జూలై 14న చంద్రయాన్-3ని శ్రీహరికోట నుంచి ప్రయోగించినప్పుడు కూడా ల్యాండర్, అందులో ఉన్న రోవర్ అంటూ పేర్కొన్నారు తప్ప విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన రోవర్ అని చెప్పలేదు. ఎట్టకేలకు రెండు వారాల నుంచి విక్రమ్ ల్యాండర్ పేరు ప్రసార మాధ్యమాలలో మార్మోగుతోంది. చివరికి విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై సాఫ్ట్ ల్యాండింగ్ కావడంతో ఈ పేరుకు విశేష ప్రాధాన్యత వచ్చింది.



చంద్ర మండలంలో దిగిన విక్రమ్ ల్యాండర్

ఇంతకీ విక్రమ్ అనే పేరు ఎలా వచ్చింది.. అంటూ ఎంతోమంది చర్చించుకున్నారు. అంతరిక్ష ప్రయోగాలకు ముందు అంతా మా వల్లే జరిగిందని చెప్పుకునే తమిళనాడుకు చెందిన కొందరు ఇటీవల అక్కడ బ్లాక్‌బస్టర్ హిట్ అయిన విక్రమ్ సినిమాను కూడా ఇందుకు జత చేశారు. అయితే ఇక్కడ తమిళనాడు వాసులు గుర్తుంచుకోవాల్సిన అంశం ఒకటి ఉంది. విక్రమ్ సారాభాయ్ ఎంపిక చేసిన సువిశాల సురక్షితమైన శ్రీహరికోట దీవిలో ఎన్నో విజయవంతమైన ప్రయోగాలు జరుగుతుంటే తమిళనాడుకు చెందిన కులశేఖరపట్టణం అనే ప్రాంతాన్ని ప్రత్యామ్నాయ రాకెట్ ప్రయోగ కేంద్రంగా ఎంపిక చేయాలని అక్కడి వారు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల తమిళ మీడియాలో కులశేఖరపట్టణం గురించి విపరీతమైన ప్రచారం చేస్తున్నారు. అయితే ఎప్పటికీ విక్రమ్ సారాభాయ్ భారత అంతరిక్ష పరిశోధన చరిత్రలో ఒక మరచిపోలేని తీపి సంతకం. మన శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం కూడా అంతే తీపి సంతకం.

## చంద్రయాన్ ప్రయోగంలో శ్రీకాళహస్తి మహిళ ప్రతిభ



శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త
చంద్రయాన్ ప్రయోగంలోనూ, పరిశీలనలో శ్రీకాళహస్తికి చెందిన కల్పన కీలకంగా వ్యవహరించటం శ్రీకాళహస్తికే తలమానికమని పలువురు అభినందించారు. బుధవారం విజయవంతమైన చంద్రయాన్ 3 డెప్యూటీ డైరెక్టర్ కల్పనా శ్రీకాళహస్తికి చెందిన వారు కావటం విశేషం. క్రీడారంగం, సినీరంగం, రాజకీయ రంగంలో శ్రీకాళహస్తికి చెందిన వారు కీలకంగా వ్యవహరిస్తున్నారు. అంతేకాక జ్ఞానంలో శ్రీకాళహస్తికి చెందిన యువతీ యువకులు రాణిస్తున్నారన్నారు. ఎందరో నేడు విదేశాల్లో ఉద్యోగరీత్య వెళ్ళి చక్రం తిప్పుతున్నారు. భారత దేశ కీర్తి ప్రతిష్టలను మిక్కిలి ఇనుమడింపజేసిన చంద్రయాన్ 3 డెప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న కల్పన శ్రీకాళహస్తికి చెందిన యువతి కావటంతో గురువారం శ్రీశుకబ్రహ్మాశ్రమం సారధ్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ కేంద్రం లో చంద్రయాన్ 3విజయోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా యోగా గురువు మార్కండేయులు మాట్లాడుతూ చంద్రయాన్ 3 నిర్వహణలో బాగస్వామి అయిన కల్పన శ్రీకాళహస్తికి చెందిన మహిళ కావటం విశేషం అన్నారు. జాతీయ పతాకాలను ప్రదర్శిసూ జయహో విస్రో అంటూ నినాదాలు, ఇస్రో సేవలు, నిరంతర కృషి అనితరమన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల అంకుఠిత దీక్షతో నాలుగు నెలల నిరీక్షణకు దక్షిణ ధృవంపై విక్రమ్ ల్యాండర్‌ను విజయవంతంగా దించిన ఘనతలో భాగస్వామి శ్రీకాళహస్తి కావటం విశేషమన్నారు. ఈకార్యక్రమాల్లో యోగా మాస్టర్ మార్కండేయులు, శిక్షకులు భాస్కర్, గరికపాటి రమేష్‌బాబు, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకం భోజనాలు మాకొద్దు సారూ !!

**- ద్రవిడ వర్సిటీ హాస్టల్ విద్యార్థుల మెరుపు ధర్నా !!**



కుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త
ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఉన్న హాస్టల్‌లో తమకు నాసిరకం భోజనాలు అందిస్తున్నారని హాస్టల్ విద్యార్థులు గురువారం వర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట మెరుపు ధర్నా చేపట్టారు. సుమారు మూడు గంటలపాటు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతకొంతకాలంగా హాస్టల్‌లో ఉడికీ ఉడకని అన్నం, నీళ్లలాంటి సాంబారు వంటి ఆహారం అందిస్తున్నారని విద్యార్థులు పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు హాస్టల్ వార్డెన్‌ను కలసి తమకు నాణ్యమైన భోజనం అందించాలని కోరితే ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ డా॥ ఎకె వేణుగోపాల్‌రెడ్డి వర్సిటీ ప్రధాన గేటు వద్దకు చేరుకుని విద్యార్థులతో చర్చించారు. ఇకపై నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

# పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత

**టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి**

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 24, ప్రభాతవార్త
పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నా మని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కొత్తగా కొనుగోలు చేసిన 12 ట్రాక్టర్లను టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర్ రెడ్డి



మాట్లాడుతూ తిరుపతి నగరం పెద్ద ఎత్తున విస్తీర్ణం అవుతున్నదని, నగరంలో నివాసం వుండాలనే ప్రజల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నాయని దానికి అనుగుణంగా మున్సిపల్ కార్పొరేషన్ తగిన చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. అనంతరం మేయర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో తిరుపతి నగరానికి ఉన్న విశిష్టతను దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా పరిశుభ్రత నగరంగా రూపొందించేందుకు ప్రణాళిక బద్ధంగా తగు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం అంతక్రితం నగరంలో గల మారస సరోవర్ మార్గంలోని బిడి కాలనీలో 40 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును టిటిడి ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరునాకర్ రెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ హరిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోఆధం రాధాకృష్ణ రెడ్డి, బోకం అనీల్ కుమార్, తిరుపతి మునిరామిరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ భరత్‌కే మళ్ళీ జిల్లా వైకాపా పగ్గాలు



చిత్తూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త:
జిల్లా వైకాపా అధ్యక్షుడిగా మళ్ళీ ఎమ్మెల్సీ భరత్ నియమితులయ్యారు. జిల్లా వైకాపా అధిష్టానం గురువారం జిల్లా వైకాపా కార్యవర్గంను ఖరారు చేసింది. ఈ మేరకు జిల్లా వైకాపా ఉపాధ్యక్షులుగా హేమసుందర్‌రెడ్డి(పుంగనూరు), శరత్‌రెడ్డి(పూతలపట్టు), కోశాధికారిగా పి.ధనంజయరెడ్డి(గంగాధనెల్లూరు), ప్రధాన కార్యదర్శులుగా ఎం.ప్రదీప్‌రాజు(పుంగనూరు), పిఎస్.వినోద్‌కుమార్(కుప్పం), విమల లక్ష్మీనారాయణ(పలమనేరు), కార్యదర్శులుగా ప్రభాకర్‌రెడ్డి(పుంగనూరు), టి.చిన్న చెంచురెడ్డి(పుంగనూరు), వి.లోకేష్‌రెడ్డి(కుప్పం), తమ్మిరెడ్డి(పలమనేరు), పి.శ్రీధర్‌రెడ్డి(చిత్తూరు), ఎం.మనోహర్‌రెడ్డి(పూతలపట్టు), మేరి(నగరి), ఎం.గోపి(జిడినెల్లూరు)లు నియమితులయ్యారు. అలాగే 45 మందితో కూడిన జిల్లా వైకాపా కార్యవర్గంను పార్టీ అధిష్టానం ప్రకటించింది.

# వరలక్ష్మి వ్రతం ఏర్పాట్లు పూర్తి

**భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విస్తృత ఏర్పాట్లు : జేఈఓ వీరబ్రహ్మం**



తిరుచానూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త
తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో నేడు శుక్రవారం వరలక్ష్మి వ్రతానికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టిటిడి జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. తిరుచానూరులోని ఆస్థాన మండపంలో గురువారం జేఈవో వరలక్ష్మి వ్రతం ఏర్పాట్లపై శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆస్థానమండలంలో వరలక్ష్మి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వర్ణరథం పై శ్రీ పద్మావతి అమ్మవారు నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నట్లు చెప్పారు. 500 మంది గృహస్తులు నేరుగా టిక్కెట్లు కొనుగోలు చేసి ఆస్థాన మండపంలో పాల్గొంటారని తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 778 మంది గృహస్తులు వర్చువల్ సేవ టికెట్లు బుక్ చేసుకున్నట్లు తెలిపారు. వరలక్ష్మి వ్రతాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేయాలని, అన్న ప్రసాదాలు, మజ్జిగ, తాగు నీరు పంపిణీ చేయాలని ఆదేశించారు. భక్తులకు పంపిణీ చేసేందుకు కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, గాజులు సిద్ధంగా ఉంచుకోవాలని, భజన బృందాలను ఏర్పాటు చేయాలని హింధూ ధర్మ ప్రచార పరిషత్ అధికారులను ఆదేశించారు. అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం, ఇతర ప్రాంతాల్లో ఆకట్టుకునేలా పుష్పాలంకరణ, విద్యుద్దీ పాలంకరణ చేపట్టాలని సూచించారు. వరలక్ష్మి వ్రతాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారాలు అందించేందుకు వీలుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ స్థాన మండపంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జేఈవో అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇలు సత్య నారాయణ, వెంకటేశ్వర్లు, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఇఇలు మనోహర్, నరసింహమూర్తి, ఏఈవో, ఏవిఎస్వో శైలేంద్ర బాబు, విఐ రామ్మోహన్ ఎలక్ట్రికల్ చంద్రశేఖర్, అదనపు హెల్త్ ఆఫీసర్ సునీల్, గార్డెన్ మేనేజర్ జనార్ధన్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భక్తిప్రవర్తలతో తవణం పల్లకి ఉత్సవం

పుత్తూరురూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:
పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా(తిరుణాళ్లు) తవణంపల్లకి ఉత్సవాన్నిఘనంగా నిర్వహించారు. ఉభయ దాత ఆనంగి మునెమ్మ, ఆనంగి కృష్ణయ్య కుమారులు ఆనంగి రవిబాబు(సాయిరాం బిల్డర్స్ బెంగళూరు), మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఆనంగి ఆనంద్(ఆనంగి కృష్ణయ్య) మనవరాళ్లు ఆనంగి పల్లవి, ఆనంగి ధనుశ్రీలు వ్యవహరించారు. స్వామి, అమ్మవార్లకు ఉత్సవం కార్యక్రమాన్ని ఏ.వి.సుభాష్ ట్యాక్స్ కల్సల్టెంట్ సన్నాఫ్ ఏ.ఎం.వరదయ్య (మాజీ ప్రెసిడెంట్ బిల్డింగ్ సొసైటీ పుత్తూరు) ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం హంస వాహనంపై స్వామి, అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని బి.ఎం.చిన్నబ్బ మేస్త్రికుమారుడు బీసీ రాజా, మాజీ కౌన్సిలర్, మాజీ ఛైర్మన్ శ్రీ ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల స్వామి దేవస్థానం పుత్తూరు వారి కుటుంబ సభ్యులు మున్సిపల్ మాజీ ఛైర్మన్ బి.ఆర్.యుగంధర్, బిల్డింగ్ కాంట్రాక్టర్ బి.ఆర్.మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. సైంధవ రథోత్సవం కార్యక్రమానికి ఉభయ దాతలు, పార్వతమ్మ వైఫ్ ఆఫ్ పార్ధీవన్ పి.ఉమామహేశ్వరి, వైఫ్ ఆఫ్ రఘుపతి చంద్రిక, వైఫ్ ఆఫ్ గోవర్ధన్, కె.శశికళ, వైఫ్ ఆఫ్ కృష్ణమూర్తి ఇంధుమతి, వైఫ్ ఆఫ్ కిరణ్‌కుమార్‌లు వ్యవహరించారు. అలాగే సింహ వాహనంపై స్వామివారి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం పైడిపల్లి గ్రామానికి చెందిన నాగమణిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ



కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బి.ఎస్.మోహన్, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**నేడు ఆలయంలో కార్యక్రమాలు...**

శుక్రవారం ఉదయం నందిసేవ, అర్జునుడు తపస్సు పాశుపదాశ్రమం, గైకొనుట అనంతరం అర్జునుడు తపస్సును అధిరోహించే కార్యక్రమం అన్నదానం, రాత్రి శ్రీకృష్ణ సమేత సర్వభూపాల వాహన ఉత్సవం, సాయంత్రం ఉత్తర గో గ్రహణం కార్యక్రమం, రాత్రి రైల్వే స్టేషన్ సమీపంలోపాట కచ్చేరి, రాత్రి 9 గంటలకు వరలక్ష్మిదేవి ద్రౌపదమ్మ వారి వివాహ మహోత్సవం, అనంతరం రాత్రి 11 గంటలకు కాళికాదేవికి ఇలా వంతుని బలిచ్చే కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

## ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన యువకుడు మృతి

గుడుపల్లె, ఆగస్టు 24 ప్రభాతవార్త

మండలంలోని సి. గొల్లపల్లికి చెందిన గణేష్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నంకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈసంఘటనకు సంబంధించి మృతుడి బంధువుల కథనం మేరకు వివరాలిలా.. సి. గొల్లపల్లికి చెందిన గణేష్ డ్రైవర్‌గా పనిచేసేవాడన్నారు. ఈ నేపథ్యంలో ఇతను ఓ యువతిని ప్రేమించాడని అయితే ప్రేమ వ్యవహారంపై అతన్ని కొంతమంది బెదిరించారన్నారు. దీంతో గణేష్ ఈనెల 14వతేది పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడగా చికిత్స నిమిత్తం అతన్ని తిరుపతి ఆస్పత్రికి తరలించగా అక్కడ బుధవారం రాత్రి మృతి చెందాడన్నారు. తమ కుమారుడ్ని భయపెట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబీకులు గుడుపల్లె పోలీసులను ఆశ్రయించారు.

## రైతులకు అందుబాటులో వచ్చిన ఉలవలు

శాంతిపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త

మండలంలో వేరుసెనగ సాగు చేయలేని రైతులకు ప్రత్యామ్నాయ పంటగా ఉలవసాగుకు ఉలవలు అందుబాటులో వచ్చినట్లు కెనమాకులపల్లి సర్పంచ్ ఎవి జయరాం తెలిపారు. ఆర్‌బికె కేంద్రాల్లో రైతులు పాసుబుక్కు, ఆధార్, మొబైల్ నెంబర్లతో వివరాలు నమోదు చేసుకుని 80శాతం రాయితీతో ఉలవలు పొందవచ్చున్నారు. కిలో ఉలవలు 22రూ.లు అని ఎకరాకు 5కిలోల వంతున ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కమలమ్మ కుటుంబానికి పరామర్శ

నింద్ర,ఆగష్టు 2 ప్రభాతవార్త :

మండలంలోని చవరంబాకం గ్రామ పంచాయితీలోని వైకాపా సినియర్ నాయకులు వేలాయుధం భార్య కమలమ్మ (58) మృతి చెందిన కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి వారి కుటుంబాన్ని ఓదార్చి ఆమె భౌతికాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించినారు.కమలమ్మ కొంత కాలంగా ఆనారోగ్యంతో భాధపడుతూ బుదవారం మృతి చెందినారు.మృతి చెందిన కుటుంబానికి ఆర్‌కె రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా పదివేలు ఆర్థికసాయం అందజేసారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,యంపిపి దీపాజలంధర్‌రాజు,వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,కో ఆప్షన్ మెంబరు అనిల్‌కుమార్,మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి,మాజీ సర్పంచ్ సత్యరాజ్,సచివాలయ కన్వీనర్ గోవిందమ్మ,నాయకులు నామదేవరెడ్డి,సుదాకర్ ,తదితరులు పాల్గొన్నారు.

## పల్లెలో సమస్యలను పరిష్కరించని సర్పంచులు ఎందుకు..?

మండల మీట్‌లో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం సూటి ప్రశ్న

నారాయణవనం, ఆగస్టు 24 ప్రభాతవార్త :



పల్లెలో సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులది కాదా అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచిగా ప్రశి ంచారు. ఎమ్మెల్యేగా తాను గ్రామాలకు వచ్చినప్పుడు అవగాహన లేకుండా కొంత మంది యువకులు మాట్లాడే వరకు సర్పంచులు, కార్యదర్శులు ఎందుకు తీసుకొస్తున్నారని మండిపడ్డారు. గురువారం నారాయణవనం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి పి దివాకర్‌రెడ్డి అధ్యక్షన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరువట్యం సర్పంచ్ నాగూరును ఉద్దేశించి మాట్లాడుతూ తాను ఇటీవల వాటర్‌ట్యాంకు ప్రారంభోత్సవానికి మీ గ్రామానికి వస్తే కొంత మంది యువకులు స్మశాన స్థలం లేదంటూ తన దృష్టికి తీసుకురావడమే కాకుండా నిలదీయడం ఎంత వరకు సమంజసమన్నారు. గ్రామంలో స్మశాన స్థలం లేకపోతే ఆ సమస్యను పరిష్కరించుకోవాల్సిన బాధ్యత సర్పంచ్‌ది, తహశీల్దారుపై వుందన్నారు. అలాగే నాగిలేరు, ఎరికంబట్టులోను స్మశాన స్థలం సమస్యను పరిష్కరించాలని తహశీల్దారును ఆదేశించారు. డికెటి భూమి వున్న వాటిని రద్దు చేసి ముందు ఈ మూడు గ్రామాల్లో స్మశాన స్థలాన్ని చూపించాలన్నారు. అంతకుముందు వ్యవసాయ, పశుసంవర్థక, ఆరోగ్యశాఖ, రెవెన్యూ, విద్యాశాఖ, ఉపాధి, వెలుగు, అర్‌అండ్‌బి, అర్‌డబ్లుఎస్, విద్యుత్‌శాఖ, పిఆర్, హౌసింగ్, అంగన్‌వాడీతో పాటు అన్ని శాఖలపై చర్చించారు. మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డి, ఎంపిడిఓ గుణశేఖర్, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, డిసిసిబి డైరెక్టర్ ఊరప్ప, వైస్‌ఎంపిపి హేమమ్మ, శివశంకర్, అర్‌డబ్లుఎస్ డిఇఇ ధనంజయులునాయుడు, ఎంఇఓలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి, ఎఇఇలు ప్రకాష్‌బాబు, హేమాద్రి, మలర్, ఇఓపిఆర్‌డి డాక్టర్ వేణయ్య, డాక్టర్ దర్శిత్ రాజ్, డాక్టర్ కుమార్, ఇఙిఎస్ ఎపిఓ సుఖన్య, వెలుగు ఎపిఎం మమత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## చంద్రయాన్ సక్సెస్‌లో కల్పన కృషి ఎనలేనిది

టిడిపి జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు లత సుబ్రమణ్యం రెడ్డి

రామచంద్రాపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త:



చంద్రయాన్ సక్సెస్‌లో తెలుగుతేజం కాళహస్తి కల్పన కృషి ఎనలేనిదని టిడిపి జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు లత సుబ్రమణ్యం రెడ్డి కొనియాడారు. గురువారం కుప్పం బాదూరులో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసే చంద్రయాన్ ప్రాజెక్ట్ అసోసియేట్ డైరెక్టర్‌గా ఎంపికై ఆమె పర్యవేక్షణలో ప్రయోగం విజయవంతం కావడం అభినందనీయమన్నారు. నగిరి రూరల్ మండలం, తడుకు పేటకు చెందిన మునిరత్నం కుమార్తె కల్పన తల్లిదండ్రులకు ఎనలేని గౌరవ మర్యాదలను తీసుకువచ్చినట్లు తెలిపారు.

## వి.కోట సిఐగా లింగప్ప బాధ్యతలు స్వీకరణ

వి.కోట, ఆగస్టు 24 ప్రభాతవార్త



వి.కోట నూతన సిఐగా లింగప్ప గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన రాయచోటినుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. వి.కోటలో శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలు ఏదేనా సమస్యలు ఉంటే పోలీసులను ఆశ్రయించాలని పేర్కొన్నారు. అనంతరం ఎఎసై ్ర జయకృష్ణ అధ్వర్యంలో సిబ్బంది నూతన సిఐను సత్కరించారు.

## ప్రజలను చైతన్యపరచేందుకే సైకిల్ యాత్ర

- తెదేపా కన్వీనర్ చంద్రశేఖర్

గుడుపల్లె, ఆగస్టు 24 ప్రభాతవార్త



ప్రజలను చైతన్యపరచేందుకే తెలుగుయువత అధ్వర్యంలో సైకిల్ యాత్ర చేపట్టినట్లు కుప్పం తెదేపా కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కాడేపల్లి, పొగురుపల్లి, సంగనపల్లి తదితర గ్రామాల్లో సైకిల్ యాత్ర చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం మరింత అభివృద్ధి కావాలంటే చంద్రబాబు సిఎం కావాలన్నారు. వైకాపా పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. కార్యక్రమాల్లో ప్రోగ్రా ం కోఆర్డినేటర్ సత్యేంద్రశేఖర్, నేతలు మునిరాజు, బాబునాయుడు, బేటప్పనాయుడు, హేమాంబరగౌడు, డా॥ వెంకటేష్, తెలుగుయువత రాష్ట్ర నేత చెక్కునత్తం మణి, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం

- తెలుగుదేశం పార్టీ నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు

చిత్తూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త:



క్షేత్ర స్థాయిలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో అర్హులైన ఓటర్లు అందరి పేర్లు వుండేలా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం మాజీ ఎమ్మెల్సీ బిఎన్.దొరబాబు అధ్యక్షతన చిత్తూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో మృతి చెందిన ఓటర్లు, తొలగించిన ఓట్లు, నూతనంగా చేర్పించిన ఓట్లను పూర్తి స్థాయిలో పరిశీలించాలని ఆయన కోరారు. అలాగే గృహసారధుల్లో ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో 60 ఇళ్ళకు ఒక మహిళ, ఒక పురుష గృహ సారధులను పెట్టుకోవాలన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను ప్రతి ఇంటికి తీసుకెళ్ళాలన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు నియోజకవర్గ తెలుగుదేశం పరిశీలకులు పరసారత్నం, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వెంకిటీల సురేంద్రకుమార్, నగర పార్టీ అధ్యక్షురాలు కఠారి హేమలత, చిత్తూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షులు శశికర్‌బాబు, పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, మాజీ డిప్యూటీ మేయర్ సుబ్రి, పార్లమెంటు యువత అధ్యక్షులు రాజేష్, రాష్ట్ర మొదలియార్ సంఘ అధ్యక్షులు త్యాగరాజు, రాష్ట్ర బిసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్‌యాదవ్, నగర పార్టీ ప్రధాన కార్యదర్శి దుర్గాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## 27న రాష్ట్రసదస్సును జయప్రదం చేయండి

కార్వేటినగరం,ఆగస్టు 24 ప్రభాతవార్త:



కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన ఎఫ్.ఆర్.ఎస్ యాప్‌లు తీసివేయాలని,దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు రాధమ్మ పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలను పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అంగన్‌వాడీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రసదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేయడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వర్కర్‌కు వేతనంగా 13,500 ఇస్తుంటే,ఎపి ప్రభుత్వం 11,500 ఇవ్వడం దారుణమన్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్మికులకు కనీస వేతనం 26,000ఇవ్వాలని,పనిభారం తగ్గించాలని,రాజకీయవేదింపులు ఆపాలని కోరుతూ ఈనెల 27న విజయవాడలో జరిగే సదస్సుకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీనరసమ్మ, చెంచులక్ష్మి, ఉమ,గుణ, సౌదామి,పద్మ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాహితీవేత్త కోటేశ్వరరావు మృతి తీరనిలోటు

- ద్రవిడ రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి

కుప్పం, ఆగస్టు 24 ప్రభాతవార్త



ప్రముఖ సాహితీవేత్త, పరిశోధకులు ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు మృతి తీరని లోటు అని ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తుమ్మపూడి సంతాపసభను తెలుగుశాఖ అధ్వర్యంలో వర్సిటీలో నిర్వహించారు. ఆచార్య తుమ్మపూడి గతంలో ద్రవిడ వర్సిటీలో కొంతకాలం పనిచేశారన్నారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకు ఆయనను స్మరించుకుంటూ ఉంటామన్నారు. రెక్టార్ ఆచార ్య అనురాధ మాట్లాడుతూ తుమ్మపూడి మరణం సాహితీలోకానికి తీరని లోటన్నారు. అంతకుముందు తుమ్మపూడి చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆచార్య పళని, ఆచార్య శ్రీదేవి, ఆచార్య అరవింద్‌కుమార్, బోధన, బోధనేతరసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులపై నిరసనగా దేశం నేతల ధర్నా

వి.కోట, ఆగస్టు 24 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని వి.కోటలో తెదేపా నేతలు ధర్నా, రిలే దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం పోలీసులను పావులుగా వాడుకుని అక్రమ కేసులుబనాయిస్తోందని ఆరోపించారు. పుంగనూరు ఘటనలో వి.కోట నేతలకు ఎలాంటి సంబంధం లేకున్నా కేసులు నమోదు చేయడం పట్ల ఖండించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వైకాపా ప్రభుత్వంకు గట్టి బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో నేతలు రామచంద్రనాయుడు, ధీరజ్, ఈశ్వర్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## చిన్న వయస్సులోనే పిల్లలను మంచి మార్గంలో నడిపించాలి

:-సీయోన్ గాస్పెల్ మీనిస్ట్రీస్ సభ్యురాలు పి కరుణ

వెంకటగిరిరూరల్ ఆగస్టు 24 ప్రభాతవార్త:



తల్లి తండ్రులు తమ పిల్లలను చిన్న వయస్సులోనే మంచి మార్గం వైపు నడిపించడంతోపాటు దేవుని భయం తో పెంచడం వల్ల వారు పెద్దవారు అయిన మంచి ప్రయోజకులుగా ఉంటారని సీయోన్ గాస్పెల్ మీనిస్ట్రీస్ సభ్యురాలు పి కరుణ అన్నారు.గురువారం సీయోన్ గాస్పెల్ మీనీస్ట్రీస్ ఆదినేత పాస్టర్ ఎ డెవిడ్ ఆదేశాల మేరకు చింతగుంట రోడ్డు మార్గంలోని సీయోన్ గాస్పెల్ చర్చిలో సండే స్కూల్ చిన్నారులకు ప్రోత్సహక బహుమతులు అందజేయడం జరిగిందని వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ చిన్నా పిల్లలకు చిన్నవయస్సు నుంచే దేవుని భయం వల్ల వారు యవ్వనస్తులు అయిన తల్లి తండ్రులను గౌరవించే పిల్లలుగా ఉంటారని తెలిపారు.అదేవిదంగా యువత చేడు మార్గలను వదలి దేవుని వైపు పయనించడం వల్ల జీవితంలో మంచి ప్రయోజకులు అవుతారని తెలిపారు.అనంతరం చిన్నారులకు స్వీట్లు పంపిణి చేసి యేసు క్రీస్తు సందేశం బైబిల్ లో అంశాలను తెలియజేశారు.సండే స్కూల్ టిచర్ పి జెస్సీ,పి జాయ్ చిన్నారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జాబిల్లి అందిన వేళ కోటలో విజయోత్సవం

కోట, ఆగస్టు 24 ప్రభాతవార్త

శ్రీహరికోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతం కావడంతో కోటలో యువతలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. విక్రమ్ ల్యాండర్ చందమామ దక్షిణ ధ్రువంపై క్షేమంగా దిగిన దృశ్యాలను ప్రత్యక్ష ప్రసారంలో ఉత్కంఠగా వీక్షించిన అందరూ ఆ వెంటనే వీధుల్లోకి చేరి కేరింతలు కొట్టారు. కోట గాంధీబొమ్మ సెంటర్‌లో యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉత్సాహంగా జై భారత్ అంటూ నినాదాలు చేశారు. ఆకాశంలో చంద్రుడిని చూస్తూ గోరుముద్దలు తిన్న బాల్యమే అందరిదీ. చందమామ రావే జాబిల్లి రావే అంటూ మాతృమూర్తి పాడిన పాట వింటూ మురిసిపోయింది మనమే కదా అని అందరూ గుర్తు చేసుకున్నారు. సుదూరంగా ఉండిపోయిన చంద్రుని గురించి కథలు చెప్పుకుంటూ పెరిగాం. ఎప్పటికైనా అందుతుందా అంటూ ఎన్నాళ్లగానో వేచిచూస్తున్న కలను చంద్రయాన్-3 నిజం చేసిందన్నారు. చందమామ రావే జాబిల్లి రావే అని పాడుకోవడమే కాదు మేమే నీ వద్దకు వస్తున్నామంటూ మన విక్రమ్ తన పరాక్రమాన్ని చూపింది. ఈ మహత్తర ఘట్టాన్ని కోట వాసులు ఉద్విగ్నంగాతిలకించారు.చంద్రుడిదక్షిణధ్రువంపైరోవర్‌దిగగానేఒకరికొకరుశుభాకాంక్షలుచెప్పుకున్నారు. జాతీయ జెండాలు చేతబట్టికేరింతలుకొట్టారు. ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించాల్సిన రోజు ఇది.

## ప్రభుత్వ సంస్థల్లో పోషక ఆహార తోటల పెంపకం అవసరం

:=కృషి విజ్ఞాన కేంద్రం ఆదిపతి డాక్టర్ బిజి రాజులు

వెంకటగిరిరూరల్ ఆగస్టు 24 ప్రభాతవార్త:

ప్రభుత్వ రంగ సంస్థల్లో పోషక విలువలుతో కూడా ఆకు కూరలు పైంపక అవశ్యకత ఎంతో అవసరం అని పెరియవరం లోని కృషి విజ్ఞాన కేంద్రం ఆదిపతి డాక్టర్ బిజి రాజులు అన్నారు.గురువారం పోషక ఆహర తోటులు పైంపకం ఆవగహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ బిజి రాజులు మాట్లడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరు ఎదుర్కోంటున్న జీవన శైలి వ్యాదులు మరియు పోషకలోప సమస్యలనుంచి రక్షించుకోవలనే సేంద్రీయ పద్దతిలో పండించిన పెరటి కూరగాయలు ఆకు కూరలు పై దృష్టి ఉంచాలని తెలిపాజేశారు.అనంతరం అంగన్‌వాడి కార్యకర్తలకు,తొమ్మిదోవ బెటాలియన్ సిబ్బందికి ,ప్రభుత్వ పాఠశాల ఉపాద్యాయులకు ఉచితంగా పోషక ఆకుకూర విత్తనాలు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో కేవికె శాస్త్రవేత్త డాక్టర్ బి విజయశ్రీ,తిరుపాల్,నార్జున రెడ్డి,రాజీవన.వెంకటగిరి ఐసిడిఎస్ సిడిపిఓ షాంషాద్ బేగం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ట్రాఫ్రిక్,చోరీలపై ప్రత్యేక నిఘా : ఎస్ఐ

వెంకటగిరిరూరల్ ఆగస్టు 24ప్రభాతవార్త:

వెంకటగిరి పట్టణ,గ్రామీణ పరిధిల్లో చోరీలు,ఈవ్‌టీజింగ్ జరగకుండా తిరుపతి జిల్లా ఎస్పీ గూడూరు డిఎస్పీ మరియు వెంకటగిరి సర్కిల్ సిఐ ఆదేశాలు మేరకు చట్ట రీత్యా చర్యలు తప్పవని వెంకటగిరి ఎస్ఐ నరసింహవు గురువారం అన్నారు.అదేవిధంగా ఎవ్వరైన సరే అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడేతే చర్యలు తప్పవని హెచ్చరించారు.అదేవిదంగా పట్టణంలో ట్రాఫిక్ పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోంటున్నట్లు తెలిపారు.అదేవిదంగా చోరీలు పై కూడా గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.రాత్రి వేళల్లో పట్టణంలో తిరిగే ఆటోలు పోలీస్ స్టేషన్‌లో అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు.అలాగే రాత్రి 11గంటల సమయంలో రోడ్లు పై అనుమాన స్పదంగా సంచరించే వ్యక్తులను అదుపులోకి తీసుకోని విచారించి పంపాలని తెలిపారు.బంగారు, వెండి విలువైన వస్తువులకు మెరుగు పెడుతామని చెప్పేవారిని నమ్మవద్దని తెలియజేశారు.కొత్త వ్యక్తులు ఇచ్చే తినుబండరాలు తినకోడదని తెలిపారు.మోటర్ బైక్‌లను ఇంటిముందు ఉంచుకోనేవారు తప్పకుండా హ్యాండ్ లాక్ వేయాలని తెలిపారు.గుర్తు తెలియని వ్యక్తులు అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 08625-257033,లేదా 9440796349 నంబర్లుకు సమాచారం అందించాలని స్థానిక పట్టణ ప్రజలు పోలీసులకు సహకరించాలని తెలిపారు.

## బాత్రూంలో నీళ్లు లేక ఇబ్బందులు

గూడూరు వెలుగు కార్యాలయం తీరు ఇది

మాగోడు ఎవరు పట్టించుకోవడం లేదని మహిళల ఆవేదన

గూడూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త



తిరుపతి జిల్లా గూడూరు వెలుగు కార్యాలయ ఆవరణంలో గత మూడు రోజుల నుంచి నీళ్ళు రావడం లేదు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని పొదుపు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకి చాలా మీటింగ్స్ జరుగుతూ ఉంటాయి. ఈ సమావేశాలకు చాలా మంది ఆడవాళ్లు ఇక్కడికి వచ్చి పోతుంటారు. ఆ సమయంలో బాత్రూంకి వెళ్లాలంటే ఇక్కడ చాలా ఇబ్బందికరంగా ఉంది. గత మూడు రోజుల నుంచి నీళ్ల రావడం లేదు. ఎవరికి చెప్పినా గానీ ఎవరు పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు త్వరితగతిన బాత్రూంలకి నీళ్ల వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్యాక్టరీలో విషవాయువులు వెలవడడంతో రోగాల భారిన గ్రామస్థులు

ప్యాక్టరీ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

చిల్లకూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త



మండలంలోని తిమ్మన్నగారిపాల్యెం గ్రామం వద్ద ఏర్పాటైన టైర్ల ఫ్యాక్టరీ వద్ద గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్ధాలను టైర్ల ఫ్యాక్టరీలో రాత్రి సమయంలో కాల్చడంతో విషపూరిత వాయువులు గ్రామంలోకి వెలువడుతుందని వారు తెలిపారు. ఈ విషవాయువుల వల్ల గ్రామంలో ప్రజలు అనేక రోగాల భారిన పడుతున్నారన్నారు. పలుమార్లు ప్యాక్టరీ యాజమాన్యం దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకపోవడంతో గురువారం ప్యాక్టరీ ఎదుట ఆందోళన చేయడం జరుగుతుందని ప్యాక్టరీలో వెలువడే పొల్యూషన్ అదుపు చేయాలని లేకుంటే ఆందోళన విరమించేది లేదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులుపాల్గొన్నారు.

## ఆర్డీఓ కిరణ్ కుమార్ గూడూరు డివిజన్ ప్రజలకు వరం

కోట ఎంపిడిఓ, ముతవల్లీల కమిటీ అధ్యక్షులు మొబీన్ బాష

గూడూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త



గూడూరు డివిజన్ ప్రజలకు ఆర్డిఓ కిరణ్ కుమార్ ఒక వరమని కోట ఎంపిటిసి, నియోజకవర్గ ముతవల్లీల కమిటీ అధ్యక్షులు షేక్. మొబీన్ బాష అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన ముతవల్లీల కమిటీ సభ్యులతో కలిసి ఆర్డిఓ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. దీనికి ఆర్డిఓ సానుకూలంగా స్పందించారు. అనంతరం మొబీన్ బాష స్థానిక విలేకరులతో మాట్లాడారు. గూడూరు రెండవ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, టిడ్కో గృహాలలో సుమారు ఐదు వందల కుటుంబాలకు నివశిస్తున్నారని, ఎవరైనా చనిపోతే స్మశాన వాటికకు రెండు కిలోమీటర్లు మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆర్డిఓ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అలాగే ఇంద్రా నగర్‌లో కొన్నేళ్లుగా అనుభవంలో ఉన్న షాదీమంజిల్ స్థలంలో బోరు వేయాలని కోరామన్నారు. ఆర్డీఓ వెంటనే స్పందించి బోరు వేయించేందుకు, స్మశాన వాటికకు స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కోట, వాకాడు మండల కేంద్రాల్లోనూ లక్షల రూపాయిలు ఖర్చు చేసి హింధూ, ముస్లీం, క్రైస్తవులకు స్మశాన వాటికలను నిర్మిస్తున్నారన్నారు. ఎటువంటి క్లిష్ట సమస్యలనైనా ఆర్డివో దృష్టికి తీసుకెళితే క్షణాల్లో పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఇటువంటి ఆర్డిఓ గూడూరు డివిజన్‌కు ఉండడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ముతవల్లీల కమిటీ సభ్యులు జీలానీభాష, సుబహాని, నజీర్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పేర్నాటి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన కేంద్రం బృందం

కోట,ఆగస్టు 24 ప్రభాతవార్త



రాష్ట్ర వైకాపా కార్యదర్శి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం సెంట్రల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్స్ ఎక్స్పోర్ట్ డెవలమెంట్ మేనేజర్ పెద్దాస్వామి ,నెల్లూరు జిల్లా హార్టికల్చలర్ అధికారి సుబ్బారెడ్డిలు పరిశీలించారు.అకిలవలస గ్రామంలో ఉన్న పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, హేమ సుష్మిత్ రెడ్డిల సేంద్రీయ క్షేత్రంలో పేర్నాటి న్యాచురల్స్ ఉత్పత్తులను వారు పరిశీలన చేశారు. ఇప్పటి వరకు మన దేశానికి సబంధజంచి విక్రయాలు జరిగాయి. కాని విదేశాలకు పెద్ద ఎత్తున ఎగుమతి చేసే అవకాశం లేదు.కానీ విదేశాలల్లో పేర్నాటి నేచురల్స్ ఉత్పత్తులకు డిమాండు ఉన్న నేపథ్యంలో పేర్నాటి దంపతులు ఎగుమతి కొరకు దరఖాస్తు చేసుకోగా అధికారులు పేర్నాటి న్యాచురల్స్ ఉత్తత్తులను పరిశీలన చేసింది. తమ సొంత పొలంలో సేంద్రీయ వ్యవసాయం ద్వారా నాణ్యమైన ఉత్తత్తులను తయారు చేస్తున్న పేర్నాటి దంపతులను ప్రశంసించారు. తమ పేర్నాటి నేచురల్స్ సంస్థ తక్కువ కాలంలో అభివృద్ధి చెందడం పట్ల పేర్నాటి దంపతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ఉడతావారి పాల్యెంలో మహాశక్తి కార్యక్రమం

చిల్లకూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త



మండలంలోని ఉడతావారి పాల్యెం గ్రామంలో జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మహిళల కోసం చేపడుతున్న మహాశక్తి కార్యక్రమంలో భాగంగా గురువారం గూడూరు మాజీ ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డి మహాశక్తి టీం లీడర్, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతితో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళల భద్రత కోసం మహాశక్తి కార్యక్రమం ప్రవేవ పెట్టడం సంతోషదాయకమన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యి నాలుగు సంవత్సరాలు పూర్తైనా రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైయ్యిందన్నారు. రాష్ట్రాన్ని 40 సంవత్సరాల వెనక్కి తీసుకెళ్ళిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. మహాశక్తి కార్యక్రమంలో ఉచితంగా బస్సు సౌకర్యం, ఏటా మూడు సిలిండర్లు, తల్లికి వందనం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెట్టేందుకు ముందడుగు వేయడం జరిగిందన్నారు. 2024 ఎన్నికల్లో గూడూరులో పాశం సునీల్ కుమార్‌ను ఎమ్మెల్యేగా, రాష్ట్రంలో సిఎంగా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి మహాశక్తి ద్వారా జరిగే కార్యక్రమాలను ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్ళు అన్నం మునిశేఖర్, దాసరి శైలజ, గుండాల భారతి, సుబ్బరత్నమ్మ, కీర్తిపాటి సుధ, మేకల కుమార్, మర్రెయ్య, చిరంజీవి, అశోక్, తిరుపాల్, కృష్ణయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆదుకునే పాలన కావాలా?వడ్డించే నాయకులు కావాలా?

కుమ్మరపల్లిలో దేశం నాయకులు

శ్రీకాళహస్తి రూరల్, ఆగస్టు24 ప్రభాతవార్త



ప్రజల్ని కన్న బిడ్డలా కాపాడి రైతులను కంటికి రెప్పలా కాపాడిన నారాచంద్రబాబునాయుడు కావాలా? లేక నిత్యం పన్నుల బాదుడుతో కరెంటు కోతలతో పరిపాలించే ఒక్క ఛాన్సు నాయకుడు కావాలా?అని ప్రజలు తేల్చుకునే రోజులు దగ్గర పడ్డాయని శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా ఏర్పేడుమండలం కుమ్మరపల్లిలో ఇంటింటికి పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతూ ఒక్కచాన్సు అంటూ మొసలి కన్నీరు కార్చిన నాయకునికి పట్టం కట్టారు.నేడు ఏం జరుగుతుందో అర్థమౌతుందన్నారు. కరెంటు చార్జీల బాదుడు,వ్యవసాయానికి గిట్టుబాటు ధరల్లేదు.రైతులకు అందిస్తున్న వెసులుబాట్లు కన్నా నిర్లక్ష్యం ఎక్కువగా ఉందని వివరించారు. ఆయనతో పాటు ఏర్పేడు మండల నాయకులు ధనంజయులు నాయుడు, రెడ్డివారి గురువారెడ్డి,శివశంకర్‌రెడ్డి,క్లస్టర్ ఇన్‌చార్జి చెంచయ్యనాయుడు, చెలికం పాపిరెడ్డి, బాలకృష్ణారెడ్డి,ఆనంద్‌రావు రెడ్డి, మునెయ్య, నాగేశ్వరరావు, గుణయాదవ్,రాచేటిసుబ్రమణ్యం,శేషంనాయుడు,రాఘవేంద్రనాయుడు, రాజా, జగదీష్‌లు పాల్గొన్నారు.

## తెదేపాలోకి భారీ వలసలు

-150కుటుంబాలు పార్టీలో చేరిక

శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో తుపాకుల రత్నమ్మ మరియు కుమార్‌ల ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి 150 కుటుంబాలు పట్టణ అధ్యక్షులు విజయకుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి బొజ్జలవెంకట సుధీర్‌రెడ్డి వారికి తెదేపా కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్టీలంటే దివంగత నేత తన తండ్రి బొజ్జలగోపాలకృష్ణారెడ్డికి ఎంతో ప్రేమ అని ఎస్టీ సెంటర్లు అభివృద్ధి చేసింది గోపాలన్న ఒక్కరే అని వారికి 90శాతం సబ్సిడీ రుణాలను అందించిన ఘనత గోపాలన్నకే దక్కుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో తుపాకుల రత్నమ్మ మరియు కుమార్‌లు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవ్గంలో ఎస్టీలకు మంచి జరిగిందంటే అది దివంగత నేత గోపాలన్నదే అన్నారు. రాబోవు ఎన్నికల్లో ఎస్టీలకు బొజ్జలకుటుంబం చేసే మంచిని వివరిస్తూ తెలుగుదేశంపార్టీ గెలుపుకోసం కృషి చేస్తామని బొజ్జలసుధీర్‌రెడ్డిని ఎంఎల్‌ఏగా గెలిపించుకుంటామన్నారు. పార్టీలో చేరిన వారిలో పి.లక్ష్మిరాధావెంకటలక్ష్మి, కవిత, అంకమ్మ, మౌనిక, వెంకటమ్మ, మునెమ్మ, రాజమ్మ, వరలక్ష్మి, చల్లమ్మ, అమ్ములు, సుబ్బలక్ష్మి, వనజాక్షమ్మ, వెంకటలక్ష్మి, మరియు 150కుటుంబాల పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు, పార్లమెంటు నాయకులు, క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

## ఆధార్‌కార్డు సర్వీసులను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త

పురపాలక సంఘంలో ఈనెల 25,26వ తేదీల్లో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సిటిజెన్ అవుట్‌రీచ్ క్యాంప్ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు ఒప్రకటనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిట చేర్చుటకు ఈ క్యాంపులు ఎంతో ఉపయోగపడుతాయని ప్రజలందరు తమ ఆధార్‌కార్డులో మార్పులు చేర్పులు చేసుకునేందుకు సదావకాశం అన్నారు. ఇందులోభాగంగా శుక్రవారం(నేడు) మరియు శనివారం వార్డు వాలంటీర్లు మరియు పురపాలక సంఘ ఉన్నతాధికారులు వార్డు సచివాలయ పరిధిని పరిగణలోకి తీసుకుని క్లస్టర్ నందు 50 ఇండ్లకు ఒక బృందాన్ని ఏర్పాటు చేశామనిప్రతి ఇంటికి ఆధార్ సర్వీసులుపై మున్సిపల్ సర్వీసులపై వెల్ఫేర్ క్యాలెండర్, కార్యదర్శిలసెల్ నంబర్ల వివరాలు మీసేవా మరియు నాన్ మీసేవ సర్వీసెస్ మరియు ప్రభుత్వ పథకాలుకు సంబంధించి దరఖాస్తుచేసుకోనువిధానాలపైవార్డుమొత్తంపర్యటించివార్డు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

## మాదిగల విశ్వరూప సభను విజయవంతం చేయండి

-ఎంఆర్‌పిఎస్ మండల ఇన్‌ఛార్జిగా బాలసుబ్రమణ్యం

తొట్టంబేడు, ఆగస్టు 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గ సన్నాహక సభలు నిర్వహణలో భాగంగా ఎంఆర్‌పిఎస్ తొట్టంబేడు మండల ఇన్‌ఛార్జిగా కాపులూరి బాలసుబ్ర మణ్యం మాదిగను ఎంఆర్‌పిఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వేలూరు రాజేంద్రమాదిగ చేతులమీదుగా వివిధ మండలాల కార్యకర్తల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ యువజన అధ్యక్షులు వెంకటముని మాదిగ, ఇర్లరాజ, యతీష్‌మాదిగ, ఈశ్వర్‌మాదిగ, బాలరాజుమాదిగ, మోహన్‌మాది, చిన్న, మధు మాదిగ, కుమార్‌మాది, మురళీమాదిగ, ఉదయ్‌మాదిగ తదితర నాయకులు పాల్గొన్నారు.ఈసందర్భంగా కాపులూరి బాలసుబ్రమణ్యంమాదిగను పలువురు అభినందించారు.

## విద్యుత్ కోతలు ఆపకపోతే సబ్‌స్టేషన్ ముట్టడి

శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త



నియోజకవర్గంలో విద్యుత్ కోతలు ఆపకపోతే సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని తిరుపతి పార్లమెంటు తెదేపా అధికార ప్రతినిధి రంగినేనిచెంచయ్యనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. గత నెలరోజులుగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాత్రివేళల్లో మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడం దారుణమైన పరిస్థితి అన్నారు. దీనిపై విద్యుత్ అధికారులను ప్రశ్నించగా సమాధానం ఇఆర్‌ఎస్ అని చెప్పున్నారని కానీ ఈవిద్యుత్ ప్రైవేటు కంపెనీలకు అప్పనంగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఈప్రభుత్వం స్పందించి ప్రజలకు విద్యుత్ కష్టాలు తీర్చాలని లేకుంటే నియోజకవర్గంలో తెదేపా ఇన్‌ఛార్జి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## సిమెంటు రోడ్డు వేసారు: కాలువలు మరిచారు

ఇళ్లలోకి వర్షపు నీరు

శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో వివిధ శాఖల మధ్య సమన్వయ లోపంతో కొన్ని ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని న్యాయవాది ఏ. బాలాజి శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డికి విన్నవించారు.ఇక్కడ రోడ్డు పరిస్థితిని ఎంఎల్‌ఏకు వివరిస్తూ కొత్తపేట శీతలాంబ ఆలయం నుంచి తూర్పుదిశగా మున్సిపల్ శాఖ మురుగునీటి కాలువ నిర్మించలేదని వివరించారు. ఇక్కడి అధికారులు,పాలకుల అలసత్వానికి నిదర్శనంగా ఈ ప్రాంతంలో నివాసముంటున్న ప్రజలు ఇంటి వ్యర్థపు నీరు బయటకు పోకకుండా రోడ్ల మీద నిలిచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారమని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్‌అండ్‌బి అధికారులు ఒక అడుగు ఎత్తు సిమెంటు రోడ్డును నిర్మించారు.కానీ పక్కన మురుగునీటి కాలువను నిర్మించలేదు. రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో ఈ ప్రాంతంలో నివాసముంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.ఈ సమస్యలపై అధికారులకు ఎన్నో వినతి పత్రాలు అందించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఎంఎల్‌ఏకు వివరించారు.ప్రస్తుతం ఆర్‌అండ్‌బి అధికారులు కొత్త సిమెంటు రోడ్డు నిర్మించటంతో ఇళ్ళు సుమారు మూడు అడుగుల లోతుకు వెళ్ళినాయని వివరించారు.దాంతో చినుకు పడితే చాలు వలసలు వెళ్ళే దుస్థితి చోటు చేసుకుందని బాలాజి ఎంఎల్‌ఏకు అందించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. కాబట్టి ఎంఎల్‌ఏ చొరవ చూపి 1913 వీధి సర్వే మేరకు మురుగునీటి కాలువలను నిర్మించాలని ఆక్రమణలను తొలగించాలని అభ్యర్థించారు.

## నేటి నుంచి రెండు రోజుల పాటు సిటిజన్ ఔట్ రిచ్ క్యాంప్

కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 24, ప్రభాతవార్త



ఈ నెల 25,26వ తేదీలలో నగర పాలక సంస్థ పరిధిలో నిర్వహించే సిటిజన్ ఔట్ రిచ్ క్యాంప్‌లో అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ఇంటికే చేరుకుని సిటిజన్ ఔట్ రిచ్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్ర , శని వారాల్లో వార్డు సెక్రటరీలు, వార్డు వాలంటీర్లు, నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు వార్డు సచివాలయ పరిధిని పరిగణలోనికి తీసుకుని ప్రతి క్లస్టర్ నందు 50 ఇండ్లకు ఒక్క టీంగా ఏర్పాటు చేశామని అన్నారు. వీరు ప్రతి ఇంటికి ఆధార్ సర్వీసుల పై, మున్సిపల్ సర్వీసుల పై, వెల్ఫేర్ క్యాలెండర్, సచివాలయం సెక్రటరీ ఫోన్ నెంబర్లు వివరములు, మీ సేవ, నాన్ మీసేవ సర్వీసెస్ పై తెలియపరుచుట, ప్రభుత్వ పథకములకు సంబంధించి దరఖాస్తు చేసుకొను విధములపై వార్డు మొత్తం పర్యటించి వార్డు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

## వైభవంగా శ్రీరేణుక మాతమ్మ వారి ఊరేగింపు

అమ్మవారి రక్షణకు బయలుదేరిన సోదరుడు పోతురాజు

తిరుపతి రూరల్, ఆగస్టు 24 ప్రభాతవార్త:



మండల పరిధిలోని కాలూరు అరుందతీ వాడలో గురువారం శ్రీ రేణుక మాతమ్మ వారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాతమ్మ ఉత్సవాలలో రెండవ రోజున వేకువజామున అమ్మవారికి అభిషేకం నిర్వహించి, వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించారు. అమ్మవారి ఆలయంలో ముగ్గును అందంగా తీర్చిదిద్దారు. అమ్మవారి సోదరుడైన పోతురాజుకు విశేష అలంకరణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, బ్యాండుబాజాలతో అమ్మవారు ఊరేగింపుకు సాగగా రక్షణగా పోతురాజు వెంట బయలుదేరారు. గ్రామంలో మహిళలు అమ్మవారికి నారికేళ కర్పూరనీరాజనాలర్పించి మ్రొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఆలయం వద్ద అమ్మవారి గోనె కాటమరాజు కథను వినిపించారు. ఈ కార్యక్రమంలో కె.చెంగయ్య, పి.నాని, డి.మునిరాజ, మురళీ, కె.వెంకటయ్య, వరగంటి రవి,రాకేష్, కప్పల గోపి, రాజేష్, గోవర్ధన్ కుమార్, మునెయ్య. యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కబ్జాదారుల నుండి నాభూమిని కాపాడండి..!

విలేకరుల సమావేశంలో బాధితుల ఆవేదన

రామచంద్రాపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త:



భూ కబ్జాదారుల నుండి తమ భూమిని కాపాడాలంటూ రామాపురం పంచాయతీ, రెడ్డినగర్‌కు చెందిన చిట్టిబాబు, ప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మీడియా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సి.రామాపురం రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నంబర్ 104లో తమకు 4 ఎకరాలు భూమి తండ్రి వారసత్వంగా స ంక్రమించిందన్నారు. తిరుపతికి చెందిన వై.గిరిధర్ రెడ్డి, అతని భార్య లావణ్య కొంత మంది రౌడీలను ఏర్పాటు చేసికుని తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. తమ భూమిపై కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ వారు లెక్కచేయకుండా భూమి ఆక్రమించుకోవడానికి యత్నిస్తున్నట్లు వాపోయారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినా స్పందించడం లేదన్నారు. తమకు న్యాయం జరగకపోతే మూకుమ్మడిగా ఆత్మహత్యలు చేసుకోవడమే శరణ్యమన్నారు.

## నల్లగంగమ్మకు వెండి కవచం విరాళం

శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి బహాదూరుపేటలో వెలసిన గ్రామదేవత నల్లగంగమ్మకు గురువారం పట్టణానికి చెందిన భక్తులు వెండి కవచాన్ని విరాళంగా బహూకరించారు. శ్రీకాళహస్తిలో రాయలసీమ కళాశాలల కరస్పాండెంట్‌గా సుపరిచయస్తులైన కాయం సుబ్బరామిరెడ్డి వారి సహచరులు కలసి రూ.80వేలు విలువ చేసే కవచాన్ని బహూకరించారు.నల్లగంగమ్మ ఆలయం ఇటీవల వేగంగా అభివృద్ధి చెందుతుంది.ఈ నేపథ్యంలో ఈ గ్రామ దేవత తల్లికి భక్తుల నుంచి విశేష సంఖ్యలో విరాళాలు అందుతున్నాయి.ఈనేపథ్యంలో గురువారం కాయం సుబ్బరామిరెడ్డితో పాటు ఆయన సహచరులు పూల రామకృష్ణారెడ్డి, మైనంపాటి దయాకర్,పోలూరు గోపాల్‌లు కలసి విరాళం అందించారు. ఆలయ చైర్మెన్ కంతా రమేష్‌కు కవచాన్ని అందించారు.ఈ కార్యక్రమాల్లో ఆలయకమిటికి చెందిన యాదగిరి,అనిల్ పూజారి గుణ, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు. దాతలకు ప్రత్యేక పూజలు తీర్థ ప్రసాదాలు అందించారు.

## ముగ్గురికి మేనమామ సాంగ్యం సహాయం



శ్రీకాళహస్తి,ఆగస్టు 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి విన్నూత్నంగా మైనారిటి ముస్లింలను ఆదుకొనుటకు నిరుపేద వధువులపై పడుతున్న భారాన్ని తగ్గించుటకు వివాహంలో తన వంతు సహాయంగా బీరువా, పట్టెమంచం,బెడ్ ఇతర సామగ్రిని అందించేందుకు 'మేనమామ సాంగ్యం'ను రూపకల్పన చేసి అందిస్తున్నారు. ప్రభుత్వం కళ్యాణమస్తు ద్వారా ఆదుకుంటుండగా శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి స్థానిక మైనారిటి ముస్లింల పట్ల తన ప్రేమా ఆప్యాయతల దృష్ట్యా వ్యక్తిగతంగా సహాయాన్ని గత మూడు సంవత్సరాలుగా అందిస్తున్నారు.ఈ కార్యక్రమాలకు ప్రజల నుంచి ఎంతో గుర్తింపు లభిస్తుంది. గురువారం మేనమామసాంగ్యంలో భాగంగా తుఫాన్ ఎసెంటర్, ముత్యాలమ్మగుడి, బంగారమ్మ కాలనీ, 9వ వార్డుల్లో వధువులకు సహాయాన్ని పార్టీ నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి ద్వారా అందించారు.ఈ కార్యక్రమాల్లో ఆయా వార్డుల్లోని బాబు, పగడాల రాజు, గోరా, కళ్యాణ్,చిన్నా, లత, లీల, కరుణాకర్, ప్రభాకర్, భాస్కర్‌రెడ్డి ఆ వార్డు పార్టీ నాయకులతో కలసి పవిత్రమ్మ వధువులకు అందించారు. షాది ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఇసుకరీచ్‌లో వాగ్వివాదం

-మాజీ సర్పంచ్ సతీమణిపై దాడి

తొట్టంబేడు, ఆగస్టు 24 ప్రభాతవార్త



మండలంలోని గుండేలిగుంట పంచాయతీ విరూపా క్షపురం ఇసుకరీచ్ నుంచి ఇసుకట్రాక్టర్లను నడుపుతునన ఓవ్యక్తి, ఆయన కుమారులు ఇసుక ట్రాక్టర్లను ఇసుకరీచ్‌లో పెట్టి ఇసుక రవాణా చేస్తూ ఉన్నారు. రీచ్ నుంచి ఇసుకను రవాణా చేయుటకు స్వర్ణముఖినది మద్యతో సుమారు మూడు కిలోమీటర్ల మేరు పెద్ద పెద్దరహదారి నిర్మించి ఇందులో ఇసుక రవాణా పూడి, పెన్నలపాడు ఆర్ అండ్ బి రహదారిమీదుగా ఇసుకరవాణా జరుపుతుంటారు. అయితే ఈరోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో మాజీ సర్పంచ్ హరి సతీమణి తాళ్ళూరు విజేత తన పొలం నది వద్ద ఉండడంతో ప్రొక్లైన్ల సాయంతో ఇసుకరీచ్ నడుపుతున్నటువంటి వారు కలసి మాజీ సర్పంచ్ విజేత పొలానికి ఆనుకుని ఉన్నటువంటి రాళ్ళగుట్ట నుంచి కంకర రాళ్ళను తరలిస్తుంటే విజేత భర్త మాజీ సర్పంచ్ తాళ్ళూరు హరియాదవ్ అడ్డుకున్నాడు. అక్కడ ఇసుకరీచ్ నిర్వాహకులకు హరియాదవ్‌లకు వాగ్వివాదం చోటుచేసుకోవడంతో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. దీంతో ఇసుకరీచ్‌ను నడుపుతున్న విజయబాబు కుమారుడు అయినటువంటి మునివెంకయ్య, ఉదయ్‌కుమార్‌లు ఇద్దరు కలసి హరియాదవ్, సతీమణి విజేతపై దాడిచేశారు. దీంతో విజేత తలపై తీవ్రగాయాలకు గురైంది. దీంతో ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఈవిషయమై తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదుచేశారు. ఈవివాదమైన తొట్టంబేడు ఎస్ఐను వివరణ కోరగా వివాదం జరిగిన విషయం వాస్తవమే అని విచారిస్తున్నట్లు తెలిపారు.

## ఈటీసి శివాలయం జీర్ణోద్ధారణకు శ్రీకారం

శ్రీకాళహస్తి, ఆగస్టు 24 ప్రభాతవార్త



పట్టణంలోని ఈటిసి కేంద్రం సమీపంలో వెలసిన శివాలయం ఆధునీకరణ పనులకు గురువారం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు భూమి పూజలు జరిపారు.ఇటీవల ఈ ఆలయంలో వెలసిన శివలింగం చర్చనీయాంశంగా మారింది.ఇక్కడ పురాతన కాలం నాటి శివాలయం ఉంది. ఈ ఆలయానికి ఇటు భాస్కరపేట,అటు వివిఎం పల్లి వాసులు పురాతన కాలంలో ఇక్కడ రాజులు పూజలు జరిపించుకొనుటకుప్రత్యేక శివాలయాన్ని నిర్మించుకున్నారు.

కాలచక్రంలో ఈ ఆలయం పూర్వ వైభవం కోల్పోయింది.ఆలయం శిధిలావస్తకు చేరుకుంది.ఈ ఆలయం ప్రాశస్త్యంను గుర్తించిన ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు జీర్ణోద్ధారణకు అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు.

దాంతో వారు రూ.12లక్షలతో అంచనాలు రూపొందించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాల్లో చైర్మెన్ శ్రీనివాసులుతో పాటు ధర్మకర్తల మండలి సభ్యురాలు పసల సుమతి, దేవస్థానం అధికారులు పవన్‌కుమార్, బాలాజి పట్టణ ప్రముఖులు పసల కుమారస్వామి, పసల భార్గవ్, ఆలయాధికారులు, ఇటికి అధికారులు సిబ్బంది చుట్టు పక్కల నివాశస్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు జరిపారు.

# తిరుపతి డివిజన్

## యానాదయ్యను రాజకీయంగా ఎదుర్కోలేకే..ఆయనపై ఆరోపణలు!

-ఏపి నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి యుగేంద్ర

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 24 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య ఎదుగుదలను ఓర్చుకోలేక,సోషల్ మీడియాలో అలాగే అడ్రస్ లేని యూట్యూబ్ ఛానెల్‌లో కొందరు పని కట్టుకుని ఆయనను రాజకీయంగా ఎదుర్కోలేక నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.యుగేంద్ర మండిపడ్డారు.గురువారం సాయంత్ర స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యానాదయ్య ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చి కష్టపడి నేడు ఏపి నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎదిగిన వ్యక్తన్నారు.నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా,బిసి జేఏసి కన్వీనర్‌గా రాష్ట్రమంతా పర్యటించి సమస్యలు తెలుసుకుని,అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి,దశాబ్దాలుగా పరిష్కారం కాని ఎన్నో సమస్యలను జగన్ సిఎం అయ్యాక ప్రభుత్వం నుండి అనేక జీఓలు తెచ్చి నాయీబ్రాహ్మణ కుటుంబాల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తి యానాదయ్య అని కొనియాడారు. సమావేశంలో రాష్ట్ర యువజన కార్యదర్శి రవిచంద్ర,తిరుపతి జిల్లా కన్వీనర్ సురేంద్ర,తిరుపతి నగర అధ్యక్షుడు గుంటూరు మహేష్,నాయకులు సురేష్,చలపతి,పవన్,ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

## డైయిరి టెక్నాలజీ కళాశాలను సందర్శించిన గ్లోబల్ డైరెక్టర్ చంద్రశేఖర్

తిరుపతిరూరల్, ఆగష్టు 24 ప్రభాతవార్త:



డైయిరీ టెక్నాలజీ పూర్వపు విద్యార్థి, సిమ్‌సా గ్లోబల్ డైరెక్టర్ ఇన్ స్పెయిన్, తెనాలి చంద్రశేఖర్ గురువారం తిరుపతి డైయిరి టెక్నాలజీ కళాశాలను సందర్శించారు. తెనాలి చంద్రశేఖర్, డాక్టర్ సి.రామ కోటరెడ్డి పర్యవేక్షణలో పట్టభద్రులైనారు. తిరుపతి డైయిరి టెక్నాలజీ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో చంద్రశేఖర్ పాల్గొన్నారు. భవిష్యత్‌లో డైయిరి టెక్నాలజీ విద్యకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని విద్యార్థులకు వివరించారు. విదేశాలలో డైయిరికి ఉన్న అవకాశాలను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు విద్యార్థుల సందేహాలపై కులంకషంగా చర్చించి, సందేహాలను నివృతి చేసారు. తిరుపతిలో చదివి స్పెయిన్ దేశంలో ఉన్నతస్థానంలో ఉన్న చంద్రశేఖర్‌ను డైయిరి టెక్నాలజి నాలుగోవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ ఓఎస్ఎ మంజునాథ్, గీతా, రవివర్మ

## కల్పనకు గాలి భానుప్రకాష్ అభినందనలు

నగరి, ఆగస్టు 24 ప్రభాతవార్త:



చంద్రయాన్-3 ప్రాజెక్టులో భాగమైన నగరి రూరల్ మండలం తడుకుపేటకు చెందిన అసోసియేట్ డైరెక్టర్ కాళహస్తి కల్పనకి నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ అభినందనలు తెలిపారు. చందమామని అందుకున్న అపురూప చరిత్ర సృష్టించిన బృందంలో మన కల్పన ఉండడం, వారు మన నగరి మహిళ కావడం మనందరికి గర్వకారణం. ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ భారతదేశానికి మరెన్నో విజయాలు అందించాలని ఆశిస్తున్నామని ఆయన తెలిపారు. ఆమె స్వగ్రామం తడుకుపేటకు కావడంతో సంబరాలు చేసుకున్నారు. గ్రామస్థులు పాఠశాల విద్యార్థులతో కలసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు.

## గాలేరు-నగరి సుజల స్రవంతి హులక్కేనా...

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు

సీపీఐ బస్సుయాత్ర జయప్రదం చేయాలని నగరిలో గోడపత్రికలు ఆవిష్కరణ

నగరి, ఆగస్టు 24 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమని సస్యశ్యామలం చేస్తామని నీటి ప్రాజెక్టలను పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ గాల్లోకలసిపోయిందని దానికి నిదరశనం గాలేరు-నగరి ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు విమర్శించారు. గురువారం నగరిలో సీపీఐ బస్సుయాత్ర పోస్టర్‌ను జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు,సహాయ కార్యదర్శి టి.జనార్ధన్, ఏరియా కార్యదర్శి కోదండంతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా నీటి ప్రాజెక్టుల్లో ఒక్క ఇంచు కూడా కదలిక లేదని రోజువారి డిజైన్లు మార్ప చేసుకుంటూ కాలయాపన చేయడం, కేటాయించిన నిధులను కూడా పక్కదారి పెట్టించంచడం షరా మామూలైందన్నారు. ఈ ప్రభుత్వానికి నీటి ప్రాజెక్టుల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి లేదని ఫలితంగా రైతాంగం ఘోరమైన స్థితికి నెట్టబడ్డారని కనుక సత్వరమే ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని పేర్కొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 17న ప్రారంభించిన బస్సు యాత్ర సెప్టెంబరు 8వ తేదీ తిరుపతిలో బహిరంగ సభతో ముగుస్తుందని ఆ సభకు 30 వేల మంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పాల్గొని ఈ ప్రభుత్వానికి హెచ్చరిక చేయడానికి సిద్ధపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వేలన్ బాషా, రవి, సిరావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నిన్నటి వరకు ఇసుక అక్రమ రవాణా ఆపాలన్నారు..!

ఇప్పుడేమో రెవెన్యూపై శివాలెత్తిపోతున్నారు..!

టిడిపి నాయకులపై రెవెన్యూ పోలీసులకు ఫిర్యాదు..!

చంద్రగిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త:




ఇదెక్కడి ఛోధ్యం .. తెలుగుతమ్ముళ్ళు అధికారంలో వున్నామనే భ్రమలో లేరుకాదా అనే భావన సర్వత్రా నెలకొన్నది. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో టిడిపికి చెందిన యుగంధర్ రెడ్డి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా గురువారం అధికారులపై విరుచుకుపడుతూ ధూషణలకు తెగబడ్డారు. నిన్నటి వరకు చంద్రగిరి నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా ఆపాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాలతో హడలెత్తించిన తెలుగుతమ్ముళ్ళు నేడు తమ వరకు కష్టం వస్తేగానీ పరిస్థితిలోని తీవ్రత బోధపడలేదా అంటూ పలువురు నిలదీస్తున్నారు. స్వర్ణముఖీ నదిపై నిర్మించిన బ్రిడ్జి సమీపంలో టిడిపికి చెందిన యుగంధర్ రెడ్డి ఇసుకను జెసిబీతో తోడేస్తున్నారనీ, బ్రిడ్జి మనుగడకు ప్రమాదకరమని ఓ మహిళా రైతు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన విఆర్‌ఓ భాస్కర్ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. దీనిపై సదరు నాయకుడు టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా దృష్టికి తీసుకెళ్ళడంతో నేరుగా రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని విఆర్‌ఓపై బూతుల దండకం అందుకున్నారు. తహశీల్దార్ శిరీషా వద్దకు చేరుకుని ఆమె ఎదుటే దురుసుగా ప్రవర్తించడం, కార్యాలయంలో విఆర్‌ఓపై శివాలెత్తిపోతూ ఆయన సృష్టించిన గందరగోళంపై ప్రతిపక్ష టిడిపితో సహా అధికార పార్టీ నాయకులు సైతం ఔరా అంటూ విస్తుపోయారు. విధినిర్వహణలో వున్న తనపై గౌస్‌భాషా వ్యవహరించిన తీరును తప్పుబడుతూ చర్యలు తీసుకోవాలని రెవెన్యూ యంత్రాంగం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## నిరుపేద కుటుంబాలకు చెవిరెడ్డి పెళ్ళి కానుక

వైస్ ఎంపిపి నిరంజన్

చంద్రగిరి, ఆగస్టు 24 ప్రభాతవార్త:



నిరుపేద కుటుంబాలకు ఎంఎల్‌ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పెళ్ళి కానుకలు పంపినట్లు వైస్ ఎంపిపి నిరంజన్ (తొండవాడ ఎంపిటిసి) తెలిపారు. తొండవాడ పంచాయతీ, అరుణ కాలనీలో నివాసం వుంటున్న సి.దుర్గ యస్.చందు నవవధూవరులకు వివాహం చేయ పెద్దలు నిశ్చయించారు. ఈ నేపధ్యంలో వీరికి ఎంఎల్‌ఏ పెళ్ళి కానుకలు పంపినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని ఏ పేదింటి కుటుంబంలో పెళ్ళి జరిగినా తనవంతుగా బంగారు తాళి"బొట్టు", వెండి మెట్టెలు, బాసికం, పట్టువస్త్రాలు, పసుపుకుంకుమలతో కూడిన కానుకలను అందజేస్తున్నట్లు తెలిపారు. చెవిరెడ్డి పెళ్ళికానులకను నవవధూవరుల తల్లిదండ్రులకు అందేసినట్లు తెలిపారు. చెవిరెడ్డి పెళ్ళికానుకలు అందించి ఆశీర్వదించడం పట్ల సదరు కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి తొండవాడ డివిజన్ కన్వీనర్ పసల నాగరాజు, తొండవాడ పంచాయతీ కన్వీనర్ కె.సురేష్ యాదవ్, సచివాలయం కన్వీనర్ కె.మునిసుబ్రమణ్యం రెడ్డి, వార్డు సభ్యులు మునిరాజ, పార్టీ సీనియర్ నాయకులు టి.రాము, బి.పరశరామ్, తొండవాడ డివిజన్ పిఆర్‌ఓ పి.గుణశఖర్ రెడ్డి, ఏపిఆర్‌ఓ బి.కుమార్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

